క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం లాభదాయం

బనగానపల్లెరూరల్ : ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలకు మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర లభిస్తోందని ప్రకృతి వ్యవసాయం యాగంటిపల్లె, మీరాపురం యూనిట్ ఇన్‌చార్జీలు హనీష్, పెద్దస్వామి సూచించారు. మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో మహిళా రైతు నాగసుధ ఏటీఎం మోడల్ పద్ధతిలో సాగు చేసిన కూరగాయాలు, ఆకుకురాల పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా హనీష్, పెద్దస్వామి మాట్లాడుతూ ఏటీఎం మోడల్ పద్ధతిలో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ రకాల కూరగాయాలను పంటలు సాగు చేయవచ్చునని, ప్రతి నెల కనీసం రూ.10-20 వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.

పూజారి మృతి

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేటలో వెలసిన సిద్దేశ్వర స్వామి ఆలయ పూజారి తంబల్ల విశ్వనాథం(60) అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రూప్ దేవాలయాల ఈఓ మద్దిలేటి, మాజీ ఆలయ కమిటీ సభ్యుడు బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ అధికారులు సుబ్బారెడ్డి, శేఖర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున అంత్యక్రియలకు రూ.10 వేలు అందజేశారు.

20న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

కొలిమిగుండ్ల: అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని యల్లనూరు రోడ్డులో ఈనెల 20న ఏర్పాటు చేయనున్న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సద్దలదిన్నె పెద్దరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు ఉలవల నరసింహుడు ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి, హనుమంతు, రాజా, రమేష్, గొర్విమానుపల్లె సర్పంచ్ రామాంజనేయులు, శ్రీను, కంబగిరిస్వామి, ఓబులేసు, జగన్, రమణయ్య, ఎంకె నాయుడు, బాలకంబయ్య, హుశేని, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

13న జాబ్‌మేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 13వ తేదీన స్థానిక ప్రభుత్వ ఐటిఐలో నిర్వహిస్తున్న జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తన కార్యాయలంలో పోస్టర్లను ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారులు సుబ్బన్న, నాగ విఘ్నేశ్వరరెడ్డి, కోఆర్డినేటర్ గోపినాథ్, డోన్ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ పుల్లారెడ్డిలతో కలిసి చైర్మన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు.

నేడు టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బనగానపల్లె : మండలంలోని టంగుటూరు గ్రామంలో నూతనంగా రూ.1.85 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఈ మేరకు బుధవారం ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆర్ వెంకటరమణ హాజరవుతారని చెప్పారు.

నాటు సారా స్వాధీనం

డోన్ రూరల్ : ప్యాపిలి మండలంలోని గుడిపాడు గ్రామంలో దాడులు చేసి 50 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, 15లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భీమలింగడు తెలిపారు. మంగళవారం సెబ్ కార్యాలయంలో ఆయన మట్లాడుతూ గుడిపాడుకు ఎక్కలూరి రంగమ్మ అనే మహిళ అక్రమంగా మద్యం అమ్ముతుండటంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె నుంచి 50 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు, 15లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మహిళను విచారించగా ప్యాపిలి గ్రామానికి చెందిన బోరెడ్డి అభిలాష్‌రెడ్డి కర్ణాటక మద్యం, తుగ్గలి మండలంలోని రోళ్లపాడు తండాకు చెందిన మూడవత్ రాజ్‌నాయక్ నాటు సారాను సరఫరా చేస్తున్నారని అంగీకరించారన్నారు.రంగమ్మను రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే మద్యం, నాటు సారా సరఫరా చేస్తున్న బోరెడ్డి అభిలాష్‌రెడ్డి, మూడవత్ రాజ్‌నాయక్‌పై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ములాయంసింగ్ వర్ధంతి

బనగానపల్లె రూరల్ : సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకులు ములాయంసింగ్‌యాదవ్ వర్ధంతిని పురస్కారించుకుని ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా కమ్యూనిటీ వైద్యశాలలో రోగులకు పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కురువతిరుపాల్, దూదేకుల దస్తగిరి, వడ్డె గిడ్డయ్య, చాకలి రాజశేఖర్, కుమ్మరి హనుమంతు, వడ్డె మహేష్, కుమారస్వామి పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

- జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని, మారుమూల గ్రామాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందజేస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం అని పేర్కొన్నారు. మండలంలోని చెరువుపల్లె గ్రామంలో ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న సంపూర్ణ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కాటసాని సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈసందర్భంగా కాటసాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని కల్పించడమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలని పెంచడంతోపాటు పీహెచ్‌సీలను అన్నివిధాలుగా అభివృద్ధి చేశారన్నారు. ప్రత్యేకించి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేయిస్తున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నారని, హెల్త్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్లు శివశంకరుడు రాఘవేంద్రారెడ్డి, ఫిరోజ్, మహమ్మద్‌బేగం, ఎంపీహెచ్ ఈఓ సుబ్బరాయుడు, సూపర్‌వైజర్ సరళగంగ తదితరులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 676 మందికి వైద్య సేవలు అందజేసినట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండంశేషిరెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్యశెట్టి, రామసుబ్బయ్య, నాగయ్య, బాషా, సూర్యనారాయణరెడ్డి, భూపాల్ పాల్గొన్నారు.



వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో మంగవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌నకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్పెషలిస్టు వైద్యులు,మెడికల్ ఆఫీసర్లు, ఆరోగ్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. 649 మందికి వివిధ రకాల జబ్బులకు వైద్యులు పరీక్షలు చేశారు. ఎస్.చెన్నంపల్లె, మదనంతపురం, రాఘవరాజుపల్లె, చింతలాయిపల్లె గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీపీ కారపాకుల నాగవేణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి చంద్రమోహన్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి భార్గవి లత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జయరామకృష్ణ పాల్గొన్నారు.

సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ఆల్వకొండలో ఎంపీడీ నాగకుమార్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు వినోద్ కుమార్, ప్రియాంక, విజయ కుమార్, శాంతి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే విధంగా 18 మందిని జిల్లా ఆసుపత్రికి సిఫారసు చేశారు. మొత్తం 743 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో ఆల్వకొండ సర్పంచ్ కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌సి బాబు, నారాయణరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవుకు: మండల పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లో డాక్టర్లు జయేంద్రారెడ్డి, సుప్రవల్లిక, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ చిన్న లింగన్న, కంటి వైద్యుడు మదాషీర్ 503 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం 7గంటలకు తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రారంభమైన మెడికల్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. బీపీ, షుగర్, గుండె తదితర పరీక్షలను వైద్యులు చేసి, కావాల్సిన మందులను రోగులకు పంపిణీ చేశారు. అలాగే 83 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. అదేవిధంగా సర్జరీలు అవసరమైన 5 మంది రోగులను ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు. అనంతరం 15 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్నాలు లచ్చమ్మ, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం అని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరావు అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల మండలంలోని కలుగొట్ల గ్రామసచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయ పరిధిలోని జోళదరాశి, కలుగొట్ల గ్రామాలకు చెందిన 512 మంది ఓపీ నమోదు చేసుకున్నారు. కోవెలకుంట్ల సీహెచ్‌సీ, రేవనూరు, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్లు మేఘన, మెగజబీన్, మహబూబ్‌సుభాని అశోక్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 261 మంది మహిళలు, 251 మంది పురుషులకు వివిధ రోగాలకు సంబంధించి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 31 మంది చిన్న పిల్లలు, 22 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే కంటి సమస్యలతో బాధపడుతున్న 66 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీటీసీ అబ్దుల్ సత్తార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు బాగున్నాయి



గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం పేద ప్రజలకుఎంతో ఉపయోగకరంగా ఉంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నా. వైద్య శిబిరంలో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్లు చాల ఓపిగ్గా వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఎంతో సంతృప్తికరంగా ఉంది. గతంలో ఇలాంటి క్యాంప్‌లు ఎవ్వరూ చేపట్టలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– బషీరూన్, పేషెంట్, చెరువుపల్లె

అన్ని పరీక్షలు బాగా చూశారు



వైద్య శిబిరంలో డాక్టర్లు పరీక్షలు బాగా చూశారు. పరీక్షలు చేశాక ఉచితంగా మందులు ఇచ్చారు. వృద్ధాప్యంలో బయట ఆసుపత్రులకు వెళ్లాలంటే ఇబ్బంది పడేవాళ్లం. ఊర్లోనే పెట్టడంతో చాలా మందికి ఉపయోగం కలిగింది. మంచి మందులు ఇచ్చారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– చెన్నమ్మ, చింతలాయిపల్లె

షుగర్ పరీక్ష చేయించుకున్నా



మోకాలి నొప్పులతోపాటు షుగర్ టెస్ట్ చేయించుకున్నా. వైద్య శిబిరం పెట్టడం వలన ప్రజలకు చాలా మేలు జరిగింది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చూపించుకుంటే ఖర్చుతోపని. అన్ని జబ్బులకు వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందజేయడం సంతోషకరం. చాలా మంచి కార్యక్రమం.

– సుబ్బరాయుడు,చింతలాయిపల్లె

వృద్ధులకు ఎంతో ఉపయోగకరం



కీళ్ల నొప్పులు, గ్యాస్, కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నా. డాక్టర్లు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతోపాటు మందులు కూడా అందజేశారు. చాలా సంతోషంగా ఉంది. కాలనీల్లో ఇలాంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఇదే మొదటి సారి. అప్పుడప్పుడు ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తే ప్రత్యేకించి మాలాంటి వృద్ధులకు ఎంతో ఉపయోగకరం.

– అలమూరు వెంకట లక్షమ్మ, హనుమాన్ నగర్ కాలనీ, బేతంచెర్ల పట్టణం







మహిళలకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం, చెన్నంపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, వృద్ధురాలికి షుగర్ పరీక్ష చేస్తున్న దృశ్యం

సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా

బేతంచెర్ల: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్య భరోసా లభించిందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని గోరుమానుకొండ గ్రామంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరి బాబు, ఈఓఆర్డీ వెంకట రంగనాయకులు, సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రామ రాధం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈసందర్భంగా రోగులకు వైద్య పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేశారు.

బేతంచెర్ల పట్టణంలో..

పట్టణంలోని 3,4, 5 సచివాలయాల పరిధిలో కమిషనర్ రమేష్‌బాబు, గ్రామ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు ముర్తుజావలి ప్రారంభించారు. డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అదేవిధంగా వృద్ధులకు కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాధ, అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, గూని నాగరాజు, దస్తగిరి, హరి, నిరంజన్, భాస్కర్ రెడ్డి, ఎద్దులన్న, మాజీ సర్పంచ్ బాబు, రాజయ్య, సీతారామాపురం సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఐసీడీఎస్ పీడీ నిర్మల పరిశీలించారు. గర్భిణులు , బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఈ సందర్భంగా పీడీ సూచించారు.



గోరుమానుకొండలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న నగర పంచాయతీ చైర్మన్, ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హెల్త్ క్యాంప్‌ను సందర్శించిన సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమె కూడా వైద్యపరీక్షలు చేయించుకున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఈఓఆర్డీ బాలకృష్ణుడు వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్యశిబిరంలో వైద్యాధికారులు ఇంతియాజ్ ఖాన్, కళ్యాణ్ బాబు, రామలక్ష్మి తదితరులు ప్రజలకు వైద్య సేవలు అందించారు. దాదాపు 352 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మరో నలుగురిని డోన్, కర్నూలు ప్రభుత్వాసుపత్రులకు సిఫారసు చేశారు.



బీపీ పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్ సరోజమ్మ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

డోన్ రూరల్ : రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిన్నమల్కాపురంలో మంగళవారం ఎంపీపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను ఎంపీపీ పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యనిస్తుందన్నారు. వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్న హెల్త్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామచంద్రుడు, జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌యాదవ్, వైఎస్ ఎంపీపీ ఎర్రిస్వామి, పారిశ్రామిక వేత్త కృష్ణారెడ్డి, సర్పంచ్ లక్ష్మిప్రసన్న, ఎంపీటీసీలు రామలక్షమ్మ, సువర్ణ, ఉపసర్పంచ్ బుగ్గన రాజేశ్వరరెడ్డి, గ్రామ నాయకులు మద్దయ్య, దాస్, బద్దల నాగరాజు, రమయ్య, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి జమ్మలమడుగు చౌరస్తా వరకు 400 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సీసీ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు ప్రభుత్వం రూ. 4 కోట్లు కేటాయించింది. ముదిగేడు చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు రూ. 4 కోట్లు విడుదల కాగా ఆరు నెలల క్రితం పనులు పూర్తి అయ్యాయి. అక్కడి నుంచి జమ్మలమడుగు చౌరస్తా వరకు మరో రూ. 4 కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. డివైడర్‌కు ఒక వైపు పనులు పూర్తికావడంతో రాకపోకలు అనుమతి ఇచ్చారు. మరోవైపు 60 శాతం పనులను పూర్తి చేసినట్లు ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి పేర్కొన్నారు.



చురుగ్గా సాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు

రాష్ట్రస్థాయి పోటీలకు పేరుసోముల విద్యార్థినులు



విద్యార్థినులతో ఎంఈఓ ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు

సంజామల: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఫ్ అండర్-17 త్రోబాల్, బేస్‌బాల్, అండర్-14 త్రోబాల్, ఖోఖో పోటీలకు సంజామల మండలం పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పావని, వర్ధిని, సన సుప్రిమ్, లక్ష్మి, మణి దీపిక, లావణ్య, గోపిక ఎంపిక అయ్యారు. నంద్యాల మున్సిపల్ పాఠశాలలో జరిగిన జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు సీతారావమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థినులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను హెచ్‌ఎంతోపాటు ఎంఈఓ ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్రతుకుకు అద్దం పట్టే కావ్యం శ్రీమద్రామాయణం

కొలిమిగుండ్ల: మానవుడు భూమిపై ప్రవర్తించాల్సిన విధివిధానాలను తెలుపుతూ జీవితానికి పరమార్థాన్ని నేర్పి బ్రతుకుకు అద్దం పట్టే కావ్యం శ్రీమద్రామాయణం అని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. తిమ్మనాయినపేటలోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ధార్మిక కార్యక్రమాలను మంగళవారం ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులతో కలిసి నగర సంకీర్తన, శోభాయాత్ర చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు సనాతన ధర్మప్రదర్శనమే శ్రీమద్రామాయణం అన్నారు. మానవుడిని మహోన్నతుడిగా తీర్దిదిద్దే కావ్యం కూడా శ్రీమద్రామాయణం అని చెప్పారు. తెలుగు పండితుడు వైవిఎస్ నారాయణరెడ్డి చేసిన ధార్మిక ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామపెద్దలు సుధాకరశెట్టి, ఎంపీటీపీ కుమారి, జయదేవానందస్వామి, ఆలయ అర్చకులు కిషోర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

డోన్ టౌన్ : ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికులతో పాటు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సాయంత్రం 4 నుండి 5గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో వివరాలు ఇలా ఉన్నాయి.

- పట్టణానికి చెందిన మాకం కృష్ణాంజనేయులు డోన్ నుండి తిరుపతికి బస్సు సర్వీసు నడపాలని కోరారు.
- ప్రవీణ్ అనే వ్యక్తి డోన్ నుంచి గుత్తికి పల్లె వెలుగు సర్వీసులు నడపాలని కోరారు.
- తుగ్గలి మండలం మారెళ్ల గ్రామానికి చెందిన వాసు మాట్లాడుతూ ఇటీవల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో నూతనంగా ప్రారంభించిన డోన్‌పత్తికొండ సర్వీసును అదనంగా నైట్ అవుట్ సర్వీసుగా పొడిగించాలని కోరారు. స్పందించిన డిపో మేనేజర్ ఈవిషయాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృసి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్

అవుకు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం అవుకు-2 గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొనాలని కోరారు.

కోవెలకుంట్లలో....

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలని 2 గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. వైద్య శిబిరంలో నలుగురు డాక్టర్లు రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. గ్రామ సచివాలయ పరిధిలోని ఆయా కాలనీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

బేతంచెర్ల: పట్టణంలోని కొత్తబస్టాండ్ కాలనీకి చెందిన జ్యోతి అనే మహిళ తలకు పట్టించుకునే రంగుతాగి, అయ్యల చెర్వుకు చెందిన ఈశా అనే యువతి మాత్రలు ఆత్మహత్యానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమత్తం శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

ఈకేవైసీ చేయించుకోవాలి

బేతంచెర్ల: పంట నమోదు చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. ఈకేవైసీ చేయించుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే పంట నష్ట పరిహారం, పంట రుణాలు, సున్నవడ్డీ, మద్దతు ధర వర్తిస్తాయన్నారు. మండలంలో 9850 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారని, 771 మంది చేయించుకోవాల్సి ఉందన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్స్ ను సంప్రదించి బుధవారం సాయంత్రంలోగా ఈకేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు.

శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

అవుకు: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రం అవుకు-2 రైతుభరోసా కేంద్రంలో శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యనిస్తుందని, విత్తనం నుంచి దిగుబడుల విక్రయం వరకు రైతులకు అండగా నిలుస్తుందన్నారు. రబీ సీజన్‌లో శనగ సాగు చేసేందుకు 40శాతం సబ్సిడీని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. బయట మార్కెట్లలో ఒక క్వింటాం ధర రూ.8100 ఉండగా ఆర్బీకేల్లో ప్రభుత్వ సబ్సిడీ పోనూ రూ.4800లకే లభిస్తున్నాయని చెప్పారు. అనంతరం రైతులతో మాట్లాడి పంటల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ అబ్దుల్ హక్, ఏఓ వెంకటేశ్వర్లు, వీఏఏలు సింధియా, ఉమాదేవి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

పకడ్బందీగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : జాతీయ ఎన్నకల కమిషనర్ ఆదేశాల మేరకు పకడ్బందీగా నూతన ఓటర్ల జాబితా తయారు చేస్తున్నామని ఆర్డీఓ వెంకటరెడ్డి తెలిపారు. ఓటర్ల జాబితాపై స్థానిక ఆర్డీఓ కార్యాలంలో అఖిల పక్ష రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 18 సంవత్సరాలు ఉన్న వ్యక్తులు నూతనంగా ఓటు హక్కు పొందడానికి ఫారం 6ను ఉపయోగించుకోవాలన్నారు. అలాగే మార్పులు, చేర్పులు, వలసలు, శాశ్వత వలసలు, మరణాలు జరిగిన వాటి కోసం ఓటర్ల జాబితాలో మార్పుల చేర్పుల కోసం ఉపయోగించే ఫారం 7,8ల గురించి అవగాహన కల్పించారు. అలాగే పోలింగ్ కేంద్రా ఏర్పాటు, బూతుల మార్పిడి గురించి వివరించారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా లేదా స్వయగా తన దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో డోన్, ప్యాపిలి మండలాల తహసీల్దార్లు విద్యాసాగర్, చంద్రశేఖర్‌వర్మ, వైఎస్సార్‌సీపీ, బీజేపీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మృతదేహం లభ్యం

బనగానపల్లె రూరల్ : మండల పరిధిలోని నందవరం గ్రామంలోని ఎస్‌ఆర్‌బీసీ ప్రధాన కాల్వలో ప్రమాదవశాత్తు సోమవారం గల్లంతైన చాకలి మధు(24) మృతదేహం మంగళవారం లభించింది. ఎస్‌ఆర్‌బీసీ ప్రధాన కాల్వలోని నీటిని పొలాల తలించేందుకు ఏర్పాటు చేసిన మోటార్ వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. సోమవారం రాత్రి వరకు కాల్వ వెంట వెతికిన ఆచూకి లభించలేదు. బనగానపల్లె అవుకు రోడ్డులో ఉన్న జలాలిబాబా దర్గా సమీపంలోని ఎస్‌ఆర్‌బీసీ ప్రధాన కాల్వ మలుపు వద్ద మధు మృత దేహం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

16 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

డోన్ టౌన్ : దసరా పండుగను పురష్కరించుకోని డోన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు మాదవరాయుడు, సూరి, హుమయూన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఉన్న ఆర్డీఓ కార్యాలయం వెనుక మిర్చి దాబా(గ్రౌండ్)లో పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ప్రథమ, ద్వితీయ బహుమలు వరుసగా రూ.20,016, రూ.10,016 చొప్పున అందజేస్తామని చెప్పారు. అదేవిధంగా బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఆల్ రౌండర్ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీ లోపల ఎంట్రీ ఫీజు రూ.700 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు.